



# సేవా దీప్తి.. అనిత రామకృష్ణ

- పరకాల ప్రజలకు ఆసరా!
- వజ్ర సంకల్పంతో ముందుకు
- స్థానిక రాజకీయాల్లో చెరగని ముద్ర
- మంచికి మారుపేరు చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ

7లో..


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 108
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
జనవరి 17, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# కన్ను పడిందా..!

- జూ పార్క్ తరలింపు అంటూ ప్రచారం
- ఇప్పటికే సెంట్రల్ జైల్ లేకుండా పోయింది
- ఇక 'జూ' కూడా లేకుండా చేసే కుట్ర
- ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్న జనం

గత బీఆర్ఎస్ పాలకుల కన్ను వరంగల్ సెంట్రల్ జైల్ పై పడినట్లు ప్రస్తుత పాలకుల కన్ను హంటర్ రోడ్డులోని కాకతీయ జూ పార్క్ పై పడిందా అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండో అతి పెద్ద సిటీగా గుర్తింపు పొందిన వరంగల్ లో వందల ఏళ్ల చరిత్ర కలిగిన సెంట్రల్ జైల్ ప్రాంతంలో గత పాలకులు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తామంటూ కేవలం మూడు రోజుల్లోనే నేలమట్టం చేయడం అప్పట్లో వివాదాస్పదంగా మారింది. అయితే కూల్చి వేయడానికి కొద్ది రోజుల ముందునుంచే సిటీ సెంటర్ లో సెంట్రల్ జైల్ అవసరమా అంటూ గత పాలకులు లీకులిచ్చారు. ఇదే నానుడిని ఇప్పుడు కాంగ్రెస్ పెద్దలు అనుసరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాకతీయ జూ పార్క్ కు కావలసినంత స్థలం ఉన్నప్పటికీ దీనిని అవసరమైతే మరో ప్రాంతానికి తరలిస్తామంటూ స్వయాన ఓ మంత్రి ప్రకటించడాన్ని పట్టణ వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. నగరంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్న ప్రస్తుత తరుణంలో జూ పార్క్ తరలిస్తామంటూ వస్తున్న వార్తలపై గ్రేటర్ ప్రజలు మండిపడుతున్నారు. అవసరమైతే పద్మాక్షి గుట్ట స్థలాన్ని కూడా జూపార్క్ అథారిటీ వారు స్వాధీనం చేసుకొని విస్తరించాలని కోరుతున్నారు.

- వరంగల్ వాయిస్,
వరంగల్ ప్రతినిధి

వివరాలు2లో..



2లో..

## కొత్తకొండలో త్రిశూలస్నానం

- వీరన్నకు మహా కుంభాభిషేకం
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

## ప్రజా పక్షమే 'వరంగల్ వాయిస్' ఇజం

4లో..

- క్యాలెండర్ ఆవిష్కరణలో ప్రముఖుల కితాబ్
- పాల్గొన్న ఎడిటర్ గడ్డం కేశవమూర్తి






## అర్హులకే ప్రభుత్వ పథకాలు

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్
- కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష

8లో..



## క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఘనంగా పోలీస్ క్రీడలు ప్రారంభం




# కన్ను పడిందా..!

- జూ పార్క్ తరలింపు అంటూ ప్రచారం
- ఇప్పటికే సెంట్రల్ జైల్ లేకుండా పోయింది
- ఇక 'జూ' కూడా లేకుండా చేసే కుట్ర
- ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్న జనం



**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ పట్టణంలో 40 సంవత్సరాల చరిత్ర కలిగిన కాకతీయ జూ పార్క్ తరలింపు అంటూ పుకార్లు శికార్లు చేస్తున్నాయి. ఇక్కడి విద్యార్థులకు విద్యా మరియు వినోదం ఒకే చోట అందించాలన్న లక్ష్యంతో 1985లో హంటర్ రోడ్డులో కాకతీయ జూ పార్క్ తోపాటు దీనికి ఎదురుగానే ఉన్న గుట్టపై సైన్స్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఈ రెండు విద్యార్థులనే కాకుండా పెద్ద వారిని సైతం ఆలోచింపజేసేవిగా పనిచేస్తున్నాయి. హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్క్ తర్వాత రాష్ట్రంలో రెండో పెద్ద జూ పార్క్ ఇదే కావడంతో సందర్శకుల తాకిడి ఎక్కువగానే ఉండేది. అదివారాలు, పండుగ రోజుల్లో అయితే వీటిని సందర్శించేందుకు వచ్చే వారి సంఖ్యను చెప్పనలవి కాదు. ఇటు వరంగల్ అటు కాజీపేట రైల్వే స్టేషన్ లకు మధ్యలో ప్రధాన రహదారిపై ఉన్న ఈ జూ పార్క్ ను సందర్శించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. అయితే గత పాలకులు వరంగల్ జిల్లాలో సెంట్రల్ జైల్ లేకుండా చేయగా నేటి పాలకులు 'జూ' కూడా లేకుండా కుట్రలు చేస్తున్నారంటూ స్థానికులు మండి పడుతున్నారు.

## 50 ఎకరాల్లో..

హంటర్ రోడ్డులోని కాకతీయ జూ పార్క్ 50 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 41 జాతులకు చెందిన 405 జంతువులు ఉన్నాయి. సందర్శకులను ఆకట్టుకునేందుకు వీలుగా వీటి సంఖ్యను రోజురోజుకూ పెంచుకుంటూ పోతున్నారు. వివిధ రకాల పక్షులు, జంతువులు, సరీసృపాలు ప్రధానంగా ఇందులో ఉన్నాయి. వాటిలో కొన్ని ఎలుగుబంటి, చిరుతపులి, వివిధ రకాల జింకలు, నల్ల ఎలుగుబంటి, నిప్పుకోడి, నెమళ్లు, పిల్లి జంగిల్, తాబేల్లు, రియాస్, పావురాలు, బంగారు నక్క, మొసళ్లు ఉన్నాయి . జూలో రంగురంగుల సీతాకోక చిలుకల పార్క్ అందరినీ అమితంగా ఆకట్టుకుంటున్నాయి. సందర్శకులను అమితంగా ఆకట్టుకునేందుకు త్వరలోనే జూ పార్క్ కు వైట్ టైగర్ తోపాటు సింహాలను తెప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

## తరలింపుపై ఆందోళన..

హంటర్ రోడ్డులోని కాకతీయ జూ పార్క్ ను అవసరమైతే ధర్మసాగర్ మండలంలోని వేలేరుకు తరలిస్తామంటూ మంత్రి ప్రకటించడం వివాదాస్పదంగా మారుతోంది. దీనిపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికే 50 ఎకరాల్లో విస్తరించి ఉన్న జూ పార్క్ ను ఆనుకొని పద్మాక్షి దేవాలయానికి చెందిన 40 ఎకరాల గుట్ట ప్రాంతం ఉన్నందున భవిష్యత్తులో కూడా పార్క్ తరలించాల్సిన అవసరం ఉండదంటున్నారు. నగరం నడి బొడ్డున ఉన్న జూ పార్క్ కు మరిన్ని జంతువులను తీసుకురావడం ద్వారా సందర్శకులను అమితంగా ఆకట్టుకోవచ్చంటున్నారు. ఈ జూ పార్కును ప్రథమ శ్రేణి జూ పార్కుగా మార్చేందుకు ఇప్పటికే కేంద్రం అనుమతి కోసం ప్రతిపాదనలను పంపినందున తరలింపు ప్రస్తావన మంచిది కాదంటున్నారు. వరంగల్ సెంట్రల్ జైల్ పరిస్థితిని జూ పార్క్ కు తీసుకురావద్దంటున్నారు.

# ఎడ్-సెట్ ను సమర్ధవంతంగా నిర్వహిద్దాం

### కేయూ వీసీ ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** అందరి సహకారంతో ఎడ్ సెట్-25 ను సమర్ధవంతంగా నిర్వహిద్దామని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఎడ్-సెట్-25 కార్యాలయాన్ని విశ్వవిద్యాలయ కామర్స్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయానికి గతంలో కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లను నిర్వహించిన అనుభవం ఉందన్నారు. ఆ అనుభవంతో మరిన్ని సెట్ లను పొందే ప్రయత్నం చేద్దామన్నారు. 1990 వ దశకంలో ఎడ్ సెట్ నిర్వహించగా గత 13 సంవత్సరాలు ఏకదాటిగా ఐసెట్ నిర్వహించినట్టు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎడ్ సెట్-25 కన్వీనర్ ఆచార్య బి.వెంకట్రామరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజు, ఆచార్య వి.రామచంద్రం, ఆచార్య ఎన్.రామనాధ కిషన్, ఆచార్య వై.వెంకయ్య, ఆచార్య గాదె సమ్మయ్య, ఆచార్య ఎన్.ప్రసాద్, ఆచార్య ఈసం నారాయణ, ఆచార్య పి.అమరావేణి, ఆచార్య ఎస్.నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఇంచార్జి ప్రిన్సిపల్ గా రామచంద్రం..

కాకతీయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ గా ఆచార్య వి.రామచంద్రం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రణధీర్ రెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు రామచంద్రంను అభినందించారు.



# కొత్తకొండలో త్రిశూలస్నానం

- వీరన్నకు మహా కుంభాభిషేకం
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

**వరంగల్ వాయిస్, కొత్తకొండ :** శ్రీ కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి విశేషంగా అష్టభైరవార్చన, నిత్యోపాసన, రుద్ర హోమం, శక్తి హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. స్వామివారికి కుంభ ఉద్వాసన, మహా కుంభాభిషేకం, వీరభద్ర స్వామి పళ్లెరం నిర్వహించి మేళ తాళాలు, భక్తుల కోలాటాల నడుమ స్వామి వారిని పవిత్ర పుష్కరిణికీ తీసుకొచ్చారు. అర్చన, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. త్రిశూలేశ్వరుని సహితంగా పవిత్ర స్నానాలు ఆచరించి, స్వామివారి దివ్య మంగళ ఆశీస్సులు పొందారు. ఉత్సవంలో భాగంగా అనంతరం శాంతి మంత్రపూర్వకంగా నిర్వహించే స్నానము త్రిశూల స్నానం అంటారు. ఈ త్రిశూల స్నానంలో పాలుపంచుకోవడంతో శరీరగ్మతలు, శత్రు, రోగ, రుణ బాధలు దరి చేరవని, త్రిశూల స్నానం ఆరోగ్యదాయకం అని అర్చకులు తెలిపారు.



# ఐనవోలు మల్లన్న
# ఆదాయం రూ.85 లక్షలు

### హుండీల లెక్కింపు పూర్తి

**వరంగల్ వాయిస్, ఐనవోలు :** ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారి హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. అక్టోబర్ 16నుంచి జనవరి 16వరకు మొత్తం 91 రోజులపాటు హుండీలో సొమ్ము రూ.31,59,335 వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. అదే విధంగా వివిధ అర్జీత సేవ టిక్కెట్ల ద్వారా రూ.53,74,034 ఆదాయం సమకూరిందన్నారు. దీంతో మొత్తం రూ.85,33,369 ఆదాయం వచ్చింది. హుండీలో వచ్చిన మిశ్రమ వెండి, బంగారంను సీల్ చేసి తిరిగి హుండీలో భద్రపరచడం జరిగిందని వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ డివిజన్ పరిశీలకులు డి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో దేవాలయ కార్యనిర్వాహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు, ఐనవోలు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్లు పి.రమేష్, రాజుకుమార్, ఐనవోలు మండల ఆర్ఐ ఆర్.సంధ్య, అర్చక సిబ్బంది, ఒగ్గు పూజారులు, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి, మహబూబాబాద్ సభ్యులు పాల్గొన్నారు.

# రెండు రోజులు
# నీటి సరఫరా బంద్..

### పైప్ లైన్ లీకేజీకి కొనసాగుతున్న మరమత్తు పనులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ దేశాయిపేట ఫిల్టర్ బెడ్ కు నీరు చేరే ప్రధాన పైపులైన్ కు పెరుకవాడ ప్రాంతంలోని పూల రంగయ్య కిరాణ దుకాణం సమీపంలో ఏర్పడిన లీకేజీకి మరమ్మత్తు పనులు కొనసాగుతున్నందున శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కేఎంసీ (ఐ –హాస్పిటల్) వాటర్ ట్యాంక్, రంగంపేట, మట్టెవాడ, కొత్తవాడ, రామన్నపేట, పోతన నగర్, హంటర్ రోడ్డు ప్రాంతంలోని సంతోషిమాత కాలనీ, గాయత్రి నగర్, శాయంపేటలోని కొంత ఏరియాలో రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేస్తున్నందున ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు సహకరించాలని ఈఈ కోరారు.

# 25న సీపీఎం రాష్ట్ర మహాసభలు

- బహిరంగ సభకు భారీగా తరలిరండి
- సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఎం 4వ తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని, జనవరి 25న సంగారెడ్డి జిల్లాలో జరుగు భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం 29వ డివిజన్ రఘునాథ్ కాలనీలో సీపీఎం రాష్ట్ర మహాసభల బహిరంగ సభ పోస్టర్ ను నాయకులు, కార్యకర్తలు కాలనీలోని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభలు జయప్రదం చేయాలని, బహిరంగ సభకు తరలిరావాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అరూరి కుమార్ కార్యక్రమంలో హాజరై మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పాలకవర్గాల దోపిడి విధానాలను ఎండగడుతూ భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణను రూపొందించే విధంగా జరుగుతున్న ఈ మహాసభలను ప్రజలు ప్రజాఉద్యమ నాయకులు వామపక్ష అభ్యుదయ శక్తులు, పార్టీ శ్రేణులు, మేధావులు, యువజనులు, మహిళలు, యావత్ ప్రజలంతా ఈ మహాసభల జయప్రదానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శులు కొల్లోజు రమేష్, కేకే రమేష్, దామర శ్రీనివాసు, పూలుమాటి శివ, భారత వీరస్వామి, బోయపల్లి గాలయ్య, మాదాసు వీరస్వామి, పోడిశెట్టి రవి, ఎండీ యాకుబ్, ఇనుముల కిరణం, ఆరేపల్లి బాబు, దుప్పటి బాబు, సూరం కుమారస్వామి, ఆరూరి వెంకటస్వామి, చిలుముల ఐలమ్మ, రాజేందర్, తెలకపల్లి రవి, శరత్, ఎండీ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సామాజిక న్యాయ వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ తెలంగాణ స్టేట్ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిచే హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఘనంగా ఆవిష్కరించారు. ఇందులో ముఖ్యులు సామాజిక న్యాయవేదిక ప్రతినిధులు పాల్గొని ఆవిష్కరణ చేశారు. స్టేట్ అధ్యక్షులు యాస పోయిన సాంబయ్య యాదవ్, సలహాదారుడు భూపాల్ రావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు వెంకటరాజ్యం, ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు సామల సుధాకర్, జనగాం జిల్లా అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారని వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్ కుమార్ తెలిపారు.

# ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయండి

- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాచర్ల బాలరాజు
- న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రెండు సంస్థల విలీనం సందర్భంగా ఈనెల 19న, రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జరుగుతుందని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాచర్ల బాలరాజు తెలిపారు. శుక్రవారం నర్సంపేట పట్టణంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ నాయకులు, కార్యకర్తలు కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచర్ల బాలరాజు మాట్లాడుతూ వ్యవసాయక విప్లవం ఇరుసుగా కలిగిన నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కోసం పోరాడుతూ భావ సారూప్యం కలిగినటువంటి వివిధ విప్లవ రైతాంగ సంఘాల విలీనం కోసం గత కొన్ని సంవత్సరాలుగా కృషి జరుగుతుందన్నారు. ఈ క్రమంలోనే రెండు, వేర్వేరు నిర్మాణాలు కలిగిన ఏఐకేఎంఎస్ సంస్థలు విలీనం కావడానికి ముందుకు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే ఈ నెల 19న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ఏర్పాటు చేయడమైనదన్నారు. ఈ సభ ప్రారంభానికి ముందు ఉదయం 10 గంటలకు ఓసీ క్లబ్ నుంచి గంగపుత్ర సంఘం భవనం వరకు ర్యాలీ ఉంటుందని , గంగపుత్ర భవనంలో కౌన్సిల్ ప్రారంభమవుతుందని, సభకు అధ్యక్ష వర్గంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు వి.కోటేశ్వరరావు, మామిడాల భిక్షపతి వ్యవహరిస్తారని ప్రధానవక్తగా ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభలో ఏఐకేఎంఎస్ జాతీయ నాయకులు చిట్టి పార్టీ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, గౌని ఐలయ్య ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. ఈ సభలో మోడీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల అమలు కోసం అలాగే కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధాన బిల్లును వ్యతిరేకిస్తూ తీసుకోబోవు భవిష్యత్తు కార్యాచరణను, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏడు వాగ్దానాలు అమలు కోసం అందులో ముఖ్యంగా రైతాంగానికి ఇచ్చిన హామీలపై చర్చ ఉంటుందన్నారు. ఈ సభను జయప్రదం చేయాలని నాయకులు, కార్యకర్తలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాడ అశోక్, గుగులోతు భద్రాజి రమేష్, భీమగాని మల్లయ్య, ఎన్ సూరయ్య, ఆకుతోట రాజు, చిరంజీవి, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూలక్క, పీవైఎల్ జిల్లా నాయకులు రంజిత్, పీడీఎస్ యూ నాయకులు అజయ్, ఐఎఫ్ టీయూ నాయకులు అశోక్ వేముల, వెంకన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలుడిని బైక్ తో ఢీకొట్టిన కానిస్టేబుల్

## పరిస్థితి విషమం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక కుమార్ పల్లి మసీదు దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న షాహిద్ అనే బాలుడిని ద్విచక్ర వాహనం ఢీకొంది. వాహనంతో బాలుడిని గుద్దిన కానిస్టేబుల్ కేసు పెట్టుకోండని నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు మండిపడుతున్నారు. వెంటనే స్థానికులు బాలుడిని ప్రైవేటు హాస్పిటల్ లో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. తలలో బ్లీడింగ్ అవుతుందని డాక్టర్లు తెలిపారు. ప్రమాదానికి కారకుడైన కానిస్టేబుల్ పై తగు చర్యలు తీసుకోవాలని బాలుడి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# టీడీపీ ముఖ్య నాయకుల మీటింగ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గంలో టీడీపీ ముఖ్య నాయకులు శుక్రవారం సమావేశం నిర్వహించుకున్నారు. రేపు తెలుగు ప్రజల ఆరాధ్య దైవం.. తెలుగుదేశం పార్టీ స్థాపించి తొమ్మిది మాసాల్లోనే అధికారాన్ని చేపట్టి బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం చేసిన నాయకుడు మహనీయుడు, మహానుభావుడు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఇసుక అడ్డ దగ్గర జంక్షన్ లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ తెలిపారు. ఎన్టీఆర్ అభిమానులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్,వరంగల్ తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు బజ్జూరి వీరేశం, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాంద్రాతి రాజు, అదే విధంగా దళిత నాయకుడు, ఎస్సీ విభాగం నాయకుడు పోలేపాక సాయికుమార్, సింగారపు మురళి, అనుముల రాజు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కొండా దంపతులు ఆదేశం మేరకు వరంగల్ తూర్పు నియోజకవర్గం టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ ల ఆధ్వర్యంలో 27వ డివిజన్ లో తెల్ల రేషన్ కార్డు లిస్టులో పేర్లు ఉన్న వారి గురించి ఇందిరమ్మ హౌసింగ్ స్కీం లో లిస్టులో పేర్లు రాని వారి గురించి మున్సిపల్ కార్పొరేషన్ వార్డు ఆఫీసర్లు పాల్తి సురేష్, నాంపల్లి నితీష ఇంటింటికి తిరుగుతూ సర్వే చేశారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్, జారతి రమేష్ మాట్లాడుతూ కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం లో పేదలందరికీ ఇల్లు లేని వారికి ఇల్లు, తెల్ల రేషన్ కార్డు లేని వారికి తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయిస్తారన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంటింటి సర్వేలో ఇందిరమ్మ హౌసింగ్ స్కీమ్ లో పేర్లు లేని వారు తెల్ల రేషన్ కార్డు లేని వారు సర్వే అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గూడ శారద, ఎర్రం కమల్, కొత్తకొండ రేష్మ, కాంగ్రెస్ నాయకులు మంద శ్రీనివాస్, పోలేపాక యాకూబ్, గూడ నవీన్, గూడా రమ్య, మంద శోభపాల్గొన్నారు.

# ప్రజాపక్షమే వరంగల్ వాయిస్ ఇజం



➲ క్యాలెండర్ ఆవిష్కరణలో ప్రముఖుల కితాబ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ వాయిస్ దిన పత్రిక 2025 నూతన క్యాలెండర్ ను శుక్రవారం కిషన్ పుర చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ దామోదర్, అడ్మినిస్ట్రేషన్ రాంబాబు, స్టాఫ్ తదితరులు ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం వరంగల్ వాయిస్ దిన పత్రిక 2025 నూతన క్యాలెండర్ ను 62వ కార్పొరేటర్ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఆవిష్కరించారు. వరంగల్ వాయిస్ దిన పత్రిక 2025 నూతన క్యాలెండర్ ను 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు, నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ వాయిస్ పత్రిక ప్రజాపక్షంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంగా ముందుకు సాగుతుందన్నారు.

## సమాజం పట్ల బాధ్యతగా ఉండాలి..

**- తహసీల్దార్ నాగరాజు**

**వరంగల్ వాయిస్, నడికూడ :** పత్రికలు ప్రజల పక్షాన నిలబడి, సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని నడికూడ మండల తహసీల్దార్ జి.నాగరాజు అన్నారు. శుక్రవారం వరంగల్ వాయిస్ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. యాజమాన్యానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన పత్రిక అని తెలిపారు. సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరవేసే విధంగా పత్రిక ఉండాలని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ కోరారు. పత్రికా కథనాలు వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పర్నెం మల్లారెడ్డి అన్నారు. తక్కువ సమయంలోనే అన్ని వర్గాల ప్రజలకు వరంగల్ వాయిస్ దినపత్రిక చేరువయిందని ఆరే సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు లోకటి నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్పం కుమారస్వామి, డాక్టర్ రోహిత్, సూర సతీష్, రాయిడి జీవన్ రెడ్డి, కుసుమ కిరణ్, పోరండ్ల మణికిరణ్, వరంగల్ వాయిస్ నడికూడ రిపోర్టర్ యాలాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పరకాలలో..

**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్ వాయిస్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను పత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, పరకాల సీనియర్ రిపోర్టర్ బొజ్జం చొక్కారవు ఆధ్వర్యంలో పరకాల సర్కిల్ ఇన్ స్పెక్టర్ క్రాంతి కుమార్ చేతుల మీదుగా శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. అలాగే, ఈ ఆవిష్కరణలో నారగోని రమేష్, దుమాల బాబురావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పరకాల సీనియర్ రిపోర్టర్ బొజ్జం చొక్కారవు ఆధ్వర్యంలో అబ్బా డి బుచ్చిరెడ్డి, విశాల్ రెడ్డి వరంగల్ వాయిస్ దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించారు.















## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వతంత్ర సమరయోధులను గౌరవించుకోవడం మనందరి కర్తవ్యమని, వారి త్యాగాలను చిరస్థాయిగా గుర్తుంచుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతో బాలసముద్రం, హనుమకొండలోని జమలాపురం కేశవరావు ఆడిటోరియం భవనాన్ని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే తో కలిసి ఎమ్మెల్యే నాయిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్వతంత్ర సమరయోధుల సేవలను గుర్తు చేస్తూ, వారికి ప్రత్యేకంగా కార్యాలయం కేటాయించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే వివరించారు. గణతంత్ర దినోత్సవం నాటికి ఈ భవనాన్ని పూర్తి చేసి స్వతంత్ర సమరయోధుల సేవలకు గౌరవించుకునే విధంగా కృషి చేస్తామన్నారు. ఇది వరంగల్ జిల్లాలో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకునే ఒక చారిత్రక కార్యమని పేర్కొన్నారు. అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ కార్పొరేషన్, ప్రజ్వల్ రైతు ఉత్పత్తి దారుల సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్నటువంటి వర్మీ కంపోస్ట్ తయారీ విధానాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, అధికారులు సీఎంఓహెచ్ రాజిరెడ్డి, మున్సిపల్ ఇన్ స్పెక్టర్ అనిల్ కుమార్, వివిధ శాఖ అధికారులు ప్రజ్వల్, సీఈవో పెద్దపల్లి రామ్మూర్తి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనుముల శ్రీనివాస్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రమేష్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అర్హుల వెరిఫికేషన్



**వరంగల్ వాయిస్, దామెర :** ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయు 4 ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలైన రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరీ, ఇందిరమ్మ ఇండ్లు, భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఫీల్డ్ వెరిఫికేషన్ ,స్పెషల్ ఆఫీసర్ కేవీ రంగాచారి ఆధ్వర్యంలో శుక్రవారం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, కారోబార్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి దొంతి అవియుక్త్ రెడ్డి చేయూత



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** పేద విద్యార్థికి నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి తనయుడు దొంతి అవియుక్త్ రెడ్డి అండగా నిలిచారు. ఉన్నత చదువుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థికి రూ.55,990 విలువ గల ల్యాప్ ట్యాప్ అందజేసి మనోధైర్యాన్ని కల్పించాడు. వివరాల్లోకి వెళ్తే బాపూనగర్ గ్రామానికి చెందిన మంతెన సన్నీ సివిల్ ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ తాడేపెల్లి గూడెం ఎన్ఐటిలో చదువుతున్నాడు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో మంతెన సన్నీ తండ్రి ప్రభుదాస్ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసి తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని చెప్పగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దొంతి మనోధైర్యాన్ని కల్పించారు. తన కుమారుడు దొంతి అవియుక్త్ రెడ్డితో ల్యాప్ టాప్ అందజేశారు. ఈ సందర్భంగా సన్నీ మాట్లాడుతూ నాకు అండగా నిలిచిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, యువ నాయకుడు అవియుక్త్ రెడ్డి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బాదవత్ రాజేందర్, కొర్ర మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

- మొదటి రోజు గంధం పూజ
- నేడు దీపారాధన.. అన్నదానం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం షరీఫ్ యాకూబ్ షావలీ బాబా ఉర్సు ఉత్సవాలు గురువారం రాత్రి గంధం సమర్పించడంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు యాకూబ్ షావలీ బాబా మజర్ (బాబా సమాధి)తో పాటు, సోదరి మహబూబీ మా, గంషావాలి, బోలె షావలీ, గౌసేపాక్ చిల్లాలను రోజ్ వాటర్ తో గుసుల్ (శుభ్రం)చేయించి, ఆనవాయితీ ప్రకారం దర్గా ముతావలీలు (ముజావర్లు) ఇంటి నుంచి గంధాన్ని డప్పు చప్పుళ్లు, ఫకీరుల విన్యాసాలతో గ్రామ పుర వీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చి బాబాకు గంధం, దట్టీలు, పూల చాదర్లు సమర్పించారు. ఊరేగింపు 3 గంటల పాటు కొనసాగింది.



ఏసీపీ తిరుపతి, ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, పర్వతగిరి సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఎస్సై ప్రవీణ్ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ అధికారి ఇన్ స్పెక్టర్ రియాజ్ పాషా, మండలంలోని పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

### ప్రత్యేక పూజలు..

మొదటి రోజు గంధం సమర్పణ కార్యక్రమంలో బాబాకు పూలు, దట్టీలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మామూనూర్



### దీపారాధన.. అన్నదానం..


అన్నారం షరీఫ్ యాకూబ్ షావలీ దర్గాలో ఉర్సు ఉత్సవాలను వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో దర్గా ముజావార్లు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజు శుక్రవారం యాకూబ్ షావలీకి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు దీపారాధన చేస్తారు. అనంతరం వచ్చిన భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. పర్వతగిరి పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు తమ సేవలు అందించగా, వక్ఫ్ బోర్డ్ అధికారులు, సిబ్బంది భక్తులకు వసతి, సదుపాయాలు కల్పించడంలో ముందుండి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

# మానుకోట జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా లఖన్ వ్యాస్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా లఖన్ వ్యాస్ నియమితులైయారు. డోర్నకల్ పట్టణానికి చెందిన లఖన్ వ్యాస్ బీజేపీలో క్రియాశీలకంగా బాధ్యతలు నిర్వహిస్తున్నందుకు ఆయనకు ఈ పదవి అందించామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లఖన్ మాట్లాడుతూ జిల్లాలో అట్టడుగు స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి నిబద్ధత, ప్రశంసనీయత, అంకితభావం కలిగిన నాయకుడిగా అందరితో కలిసి పనిచేయడం వల్ల తనకు ఈ గౌరవంగా లభించిందని భావిస్తున్నానన్నారు. ఇందుకు సహకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ఎన్నికల ఇంచార్జి ఎండ్ల లక్ష్మీనారయణ, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లకు కృతజ్ఞతలు తెలిపారు.



# బీజేపీ మండల అధ్యక్షుడికి ఘన సత్కారం



**వరంగల్ వాయిస్, దామెర :** ఇటీవల దామెర మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియామకమైన వేల్పుల రాజ్ కుమార్ ను ప్రముఖ కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శుక్రవారం దామెర మండల కేంద్రంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో వేల్పుల రాజ్ కుమార్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వరంగల్ శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ దామెర మండల అధ్యక్షుడిగా వేల్పుల రాజ్ కుమార్ ను నియామకం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల సుమంత్, సోనబోయిన రాజు, దామెరుప్పుల ఐలేష్, జల్సా రాజు, తదితరులు పాల్గొన్నారు.

# 19న ఏకశిలా కరోకే క్లబ్ రెండవ వార్షికోత్సవం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 19న ఏకశిలా కరోకే క్లబ్ రెండవ వార్షికోత్సవాన్ని సంగీత ప్రియుల మధ్య ఘనంగా నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూజా విజయ్ కుమార్, ప్రగళ్లపాటి రాజ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగిన ముఖ్యుల సమావేశంలో పై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా వరంగల్, హనుమకొండ నగరాల్లో వివిధ పాటల, కవితల కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు ఎందరో నూతన కళాకారులకు పలు అవకాశాలు కల్పిస్తూ, కళాకారులుగా ఎదగటానికి ప్రోత్సాహాన్ని అందిస్తూ, మరెన్నో సాంస్కృతిక సంస్థలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఏకశిలా కరోకే క్లబ్ సాంస్కృతిక సామాజిక సంస్థ రెండవ వార్షికోత్సవాన్ని నిర్వహించడం మహదానందంగా ఉందన్నారు. హనుమకొండ నయీంనగర్ లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గౌరవ అతిథిగా వాగ్దేవి విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ చందుపట్ల దేవేందర్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 19 న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు. సంగీతాభిమానులు, కళా పోషకులు, కళారాధకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రేవతి శ్రీగిరిరాజు, సుధా కూజా పాల్గొన్నారు.

# వేల గొంతులు - లక్ష దప్పులకు మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశం

➲ హాజరైన పలు సంఘాల నాయకులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హరిత కాకతీయలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ నేతృత్వంలో శుక్రవారం అన్ని కుల సంఘాలు ప్రజాల సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేయి స్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహాల వరకు మహా ర్యాలీ ప్రదర్శన ఉంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నారు. కాబట్టి, కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో వచ్చి మహా ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్ లో జరగబోయే వెయ్యి గొంతులు లక్ష దప్పుల మండే మాదిగల గుండె చప్పుడు దండోరా సాంస్కృతిక మహా ప్రదర్శన విజయవంతంకై హైదరాబాదులో జరిగే ప్రదర్శన విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి అతిథులుగా మిట్టపల్లి సురేందర్ కవి, రచయిత, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్డకొండ వేణుగోపాల్ హాజరై మాట్లాడుతూ అదేవిధంగా ప్రజాసంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ గౌరవ సుప్రీంకోర్టు తీర్పును తెలంగాణ రాష్ట్రంలో



తక్షణమే అమలు చేయాలని, వర్గీకరణ చేస్తే విజయోత్సవం లేకుంటే సర్కారుకు చావు డప్పే అని, దండోరా దండయాత్ర చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంద కుమార్ మాదిగ, బొడ్డు దయాకర్ మాదిగ, బొచ్చు తిరుపతి మాదిగ, గోపు జయపాల్ రెడ్డి రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మేకల కేదార్ యాదవ్ రాష్ట్ర అధ్యక్షులు, భైరపాక జయకర్ బార్ కౌన్సిలింగ్ సభ్యులు, వీరదాసు వెంకటరత్నం మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, నీలా శ్రీధర్ రావు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, తండూరి మోహన్, వేల్పుల సూరన్న కాపు, బుట్టి శ్యామ్ జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు, రామచంద్రయ్య యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐఎన్ టీయూసీ క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఐఎన్ టీయూసీ గ్రేటర్ వరంగల్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా ఐఎన్ టీయూసీ తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ హనుమకొండ జిల్లా కమిటీ క్యాలెండర్ ను ఘనంగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ శ్రీమాన్, ఐఎన్ టీయూసీ గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు పాశం.రవి యాదవ్, డి.రమేష్, సీహెచ్. సంపత్, అమ్ము వీరన్న, ఎస్.వినోద్ కుమార్, పాత రవీందర్, హరి శంకర్, ఎస్. శేఖర్, ఎస్.సునీత, మేకల సమ్మయ్య, సీహెచ్.రాజు, పి.దర్మారావు, జి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేయడం దారుణం

## బీఎన్ఆర్కేఎస్ నేత గిన్నారపు మహేందర్



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** అసంఘటిత కార్మికులు అంతస్తుల కోద్ది అందమైన భవనాలు నిర్మిస్తూ ఆ నిర్మాణాల ద్వారా వస్తున్న 1 శాతం సెస్సు ద్వారా జమవుతున్న వేల కోట్ల రూపాయలు నిధి కార్మికుల కుటుంబాలకు ఆసరాగా నిలబడుతుంది. ఆ విధంగా ఏర్పడిన ఆ నిధి నుంచి కార్మికుల కుటుంబాల సంక్షేమం కోసం ఒకవేళ కార్మికుడు ఏదైనా ప్రమాదవశాత్తు చనిపోయిన, అంగవైకల్యం ఏర్పడిన, ఆ కుటుంబానికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ఆ కుటుంబానికి అందజేసే విధంగా కార్మిక చట్టాలను రూపొందించుకోవడం జరిగింది. కార్మిక శాఖ నుంచి కార్మికులకు రావాల్సిన సంక్షేమ పథకాలకు చెందిన లబ్ధి నేరుగా లబ్ధిదారులు ఖాతాకి బదిలీ చేయడం ద్వారా ఈ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం జరిగేది. కానీ గత పది సంవత్సరాల కాలంలో కార్మిక శాఖలోని నిధులను ఇతర శాఖలకు మళ్లించడం ద్వారా సంక్షేమ పథకాల లబ్ధికి చేసుకున్న దరఖాస్తులకు నగదు జమ చేయడం కోసం నిధులు లేకపోవడంతో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఖాదర్ పేట గ్రామంలో బాధిత కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. మృతుడు లక్ష్మణమూర్తితో పాటు చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితుడి మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమవంతు సహాయంగా వారి కుటుంబానికి ఒక క్వింటా బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో చింతకాయల లక్ష్మీనారాయణ కన్నం భాస్కర్, మొగులాజి ఈశ్వర్, మండల మల్లయ్య నాంపల్లి సంపత్, గోశాల వీరస్వామి, కందకట్ల ఆనందం, నాంపల్లి శ్రీనివాస్, ఒంటరి రాములు, లక్క స్వామి, మేకల సదానందం, కుండే కోటేశ్వర్, ఆటకళ్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘ భవనం కబ్జాపై వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ వరంగల్ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా వారిని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బీజేపీ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో సుమారు 75 సంవత్సరాల చరిత్ర కలిగిన అజం జహి మిల్లు కార్మిక సంఘ భవనం కబ్జా గురైన విషయం వారికి తెలియజేసి దానిపై కార్మికులకు తగిన న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తక్కెళ్లపల్లి రాజేశ్వరరావు, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకమ్ హరి శంకర్, బీజేపీ సీనియర్ నాయకులు గడల కుమార్, పొట్టి శ్రీనివాస్ గుప్తా, కందిమల్ల మహేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

## ➲ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ లో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని ఝాన్సీరెడ్డి పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల అవగాహన పెంచేందుకు, ద్విచక్ర వాహనదారుల భద్రత కోసం హెల్మెట్లు పంపిణీ చేశారు. శాసనసభ్యురాలు స్వయంగా హెల్మెట్లు అందజేస్తూ, వాహనదారులకు రక్షణ అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు. ద్విచక్ర వాహనదారుల ప్రమాదాలను తగ్గించడానికి హెల్మెట్ ధరించడం కీలకమని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడే చర్యల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ తీసుకున్న ఈ మంచి ప్రయత్నాన్ని వారు అభినందించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతపై చిన్న ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పోలీసు అధికారులు, రోడ్డు భద్రతా నిపుణులు పాల్గొని, వాహనదారులకు కీలక సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు, రోడ్డు భద్రతా అధికారులు, యువత, పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వందలాది హెల్మెట్లు పంపిణీ చేయబడి, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెరిగేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించే సంస్కృతిని ప్రజల్లో పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మునిసిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జీనుగు సురేందర్ రెడ్డి, నాయకులు, జయపాల్ రెడ్డి, మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకొండ వీరభద్ర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పల్లా



**వరంగల్ వాయిస్, కొత్తకొండ :** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన భీమదేవరపల్లి మండలంలోని సుప్రసిద్ధ కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు మకర సంక్రాంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభం, గుమ్మడి కాయతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా వేద ఆశీర్వచనం స్వీకరించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం కోరిన వరాలు ఇచ్చే కొంగు బంగారం కొత్తకొండ వీరభద్ర స్వామి ప్రజలందరిని చల్లగా చూడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చాడ సరిత, మండల పార్టీ ఇంచార్జి భూపతి రాజు, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మాజీ మండల ఆప్షన్ నంబర్ మహమ్మద్ జానీ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు దేవేందర్, బీఆర్ఎస్ కార్యకర్తలు, యూత్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ లో 27మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ నలుగురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం రూ.2000 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 27మందికి రూ.28,600 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు.

# లావుడ్య రవినాయక్ కు అరూరి పరామర్శ



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ కార్పొరేటర్ లావుడ్య రవినాయక్ తండ్రి లావుడ్య ఈర్యనాయక్ ఇటీవల మరణించగా శుక్రవారం వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ వారి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండు రవి సాగర్ తండ్రి దండు రామస్వామి ఇటీవల మరణించారు. దీంతో వారి కుటుంబాన్ని గ్రామ మాజీ ఉపసర్పంచ్ మెంతుల రాజు ఓదార్చి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఈదునూరి సంతోష్ స్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోటకూరి కిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దండు సారంగపాణి, మాజీ వార్డు సభ్యులు పేరబోయిన కిరణ్ కుమార్ యాదవ్, వీరారౌత్ సంపత్ రెడ్డి, గోవిందు, అశోక్ హైదరాబాద్ బిల్డర్, అంకేశ్రపు రాజు, ఓని నవీన్ పాల్గొన్నారు.

# ఇండేన్ డీలర్ల సేవలు భేష్

## ◆ ఐఓసీయల్ డివిజనల్ సేల్స్ ఆఫీసర్ కె.కీర్తి




**వరంగల్ వాయిస్, కరీంనగర్ :** వంట గ్యాస్ వాడకందారులకు మరిన్ని సేవలు అందించడంలో ఇండేన్ గ్యాస్ డీలర్ల పాత్ర ప్రముఖంగా ఉండాలని ఐఓసీయల్ సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ విక్రయ అధికారిణి కె.కీర్తి కోరారు. కరీంనగర్ లోని కేఎస్ వేడుకల మందిరంలో శుక్రవారం నిర్వహించిన కరీంనగర్ సేల్స్ ఏరియా-1 ఇండేన్ గ్యాస్ డీలర్ల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రానున్న కాలంలో వంటగ్యాస్ వ్యాపారాన్ని ప్రవేట్ సంస్థలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వారికి ధీటుగా కస్టమర్లకు సేవలందిస్తే మనం కస్టమర్లను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇది ఒక్క ఐఓసీయల్ కే కాక అన్ని కంపెనీలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. గ్యాస్ వాడకందారులకు సిలిండర్లు అందించే సమయంలో ప్రీడెలివరి చెక్ (పీడీసీ) డెలివరి సిబ్బంది నిర్వహించాలని ముఖ్యంగా సిలిండర్ సీల్ తొలగించడం వాల్వు వుండే ఓ రింగ్ గమనించడం, సిలిండర్ నాణ్యత,తూకం గమనించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ డీలర్లు సుభాష్ రావు, రాధక్రిష్ణ, ప్రవీణ్, శ్రీధర్, గట్టు రాజయ్య, అమరీష్, రాము, హన్మంత్ పటేల్, వెంగళరావు, అజయ్, వెంకటేశ్వర రావు, నరేందర్, శ్రీ రాజకుమార్, మోహిత్, మీరాబాయ్, గీత ప్రభుతులు పాల్గొన్నారు.



# సేవాదీప్తి.. అనిత రామకృష్ణ



గడ్డం కేశవమూర్తి

- పరకాల ప్రజలకు ఆసరా!
- వజ్ర సంకల్పంతో ముందుకు
- స్థానిక రాజకీయాల్లో చెరగని ముద్ర
- మంచికి మారుపేరు

చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ



పదవి ఏదైనా బాధ్యతగా చేసేవారు కొందరే ఉంటారు. ఆలోచన బలంగా ఉండాలే గాని లక్ష్యసాధన దిశగా సాగే ప్రయాణంలో ఎన్ని కష్టాలు ఎదురొచ్చినా, వాటిని ఇష్టంగా స్వీకరిస్తూనే విజయం సాధించవచ్చని నిరూపించారు పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ. పోరాటాల గడ్డ పరకాలలో ప్రజాప్రతినిధిగా ఐదేళ్ల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి విశిష్ట సేవలు అందించారు. పల్లెలు, పట్టణాలు ప్రగతి దారుల్లో పయనించాలి. స్వయం నిర్ణయాధికారమే పారదర్శక పాలనకు అసలైన నిర్వచనంగా అనితరామకృష్ణ భావించారు. అందుకే దశాబ్దాల పాత పద్ధతులకు స్వస్తి పలికి సరికొత్త పంథాకు ఆమె నాంది పలికి వజ్ర సంకల్పంతో ముందుకెళ్లారు.

26న పదవీ విరమణ సందర్భంగా ప్రత్యేక కథనం

పోరాటాల గడ్డ పరకాలలో సోద అనిత రామకృష్ణ ప్రజా ప్రతినిధిగా ఐదేళ్ల పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందున్నారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉంటూ పట్టణంలో ప్రగతిని పరుగులు పెట్టించారు. ముఖ్యంగా ఆమె భర్త ప్రముఖ రాజకీయ వేత్త సోద రామకృష్ణ ప్రోత్సాహంతో ఆమె రాజకీయాల్లో రాణించారు.

## రాజకీయ ప్రస్థానం..

సోద అనిత ..రాజకీయ ప్రస్థానం పరకాల మున్సిపాలిటీ చైర్ పర్సన్ పదవితో ప్రారంభమైంది. ఆమె భర్త రామకృష్ణ రాజకీయాలపై ఉన్న మక్కువతో పంచాయతీరాజ్ శాఖలో గెజిటెడ్ పోస్టు ఉద్యోగాన్ని సైతం వదులుకున్నారు. పూర్వ పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత రాష్ట్ర మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వీరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పరకాలలోని 20వ డివిజన్ జనరల్ సీటు నుంచి కౌన్సిలర్ గా అనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె భర్త రామకృష్ణ చతురత ప్రదర్శించడంతో 11 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రోత్సాహంతో 20 20 జనవరి 27న అనిత రామకృష్ణ పరకాల మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదేళ్ల పాటు పాలకవర్గ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించి పట్టణ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారు. ప్రస్తుత పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సహకారం, ప్రోత్సాహంతో రాజకీయాల్లో వీరు ముందుకు వెళ్తున్నారు. ఈనెల 26న రిపబ్లిక్ డే పర్వదిన సందర్భంగా అనిత రామకృష్ణ పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ గా పదవీ విరమణ పొందుతున్నారు.

## ప్రగతి పథంలో పరకాల..

మున్సిపల్ చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ హయాంలో పరకాల పట్టణం అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్నది. సెంట్రల్ లైటింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణాలతో పాటు హరితహారం మొక్కలతో పట్టణ రూపురేఖలు మారాయి. మున్సిపల్, తహసీల్, ఆర్డీఓ కార్యాలయాల నిర్మాణాలు పూర్తి చేయించారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, షాపింగ్ కాంప్లెక్స్ పనులను వేగవంతం చేశారు. డిగ్రీ కళాశాల ఏర్పాటులో తమ వంతు భూమిక పోషించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి మంచి నీరును అందించారు. స్వీపింగ్ మిషన్, స్వచ్ఛ ఆటోలు, వైకుంఠ రథాన్ని సమకూర్చారు. దీంతో పాటు పట్టణంలోని వెల్లంపల్లి రోడ్డులో చిరు వ్యాపారుల కోసం ఆధునిక హంగులతో నూతన మార్కెట్ పనులు ప్రారంభించారు. ఆ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే పరకాల పట్టణం మరింత శోభను సంతరించుకోనున్నది. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో శ్రీ కుంకుమేశ్వరాలయ అభివృద్ధికి బాటలు వేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేశారు. పరకాల పట్టణాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేసిన చైర్పర్సన్ అనిత రామకృష్ణ అందరితో శభాష్ అనిపించుకున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీప దాస్ మున్షి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యల చేత ప్రశంసలు పొందారు.

## అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ..

శాసనసభ నియోజకవర్గ కేంద్రమైన పరకాలను ప్రగతిదారుల్లో పయనించేలా, స్వయం సమృద్ధి సాధించేలా మున్సిపాలిటీ చైర్ పర్సన్ అనిత రామకృష్ణ కృషి చేశారు. 2020 జనవరి 27లో ఆమె అధికారం చేపట్టే నాటికి నామమాత్రంగా ఉన్న పరకాల మునిసిపాలిటీని అన్ని విధాలా తీర్చిదిద్దారు. పాలన వ్యవహారాల్లో నిర్లక్ష్యం చేసే అధికారులు, సిబ్బందిని పరుగులు పెట్టించారు. పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అధికారులు, కౌన్సిలర్ల సమిష్టి కృషి, సహకారంతో ముందుకెళ్లారు. అలాగే పరకాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు సమీక్షించారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారు.

## ప్రొఫైల్..

**పేరు: సోద అనిత**
**హోదా: చైర్ పర్సన్, పరకాల మున్సిపాలిటీ**
**పుట్టిన తేదీ: 2-4-1974**
**తల్లిదండ్రులు: రీసాలి, మామన్ రామ్**
**భర్త: సోద రామకృష్ణ**
**సంతానం: ఇద్దరు కుమార్తెలు, రూమా దత్, శివాని**
**కుమారుడు, సాయిచంద్**



## చైర్ పర్సన్ పదవి సంతృప్తినిచ్చింది..

**- సోద అనిత రామకృష్ణ**

పరకాల మున్సిపాలిటీ చైర్ పర్సన్ పదవి పూర్తి సంతృప్తినిచ్చింది. రాజకీయ పరంగా గుర్తింపు లభించింది. నా హయాంలోనే అనేక అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. జిల్లాస్థాయిలో పరకాలకు ప్రత్యేక గుర్తింపు లభించడం ఆనందంగా ఉంది. ప్రధాన రహదారులు, సెంట్రల్ లైటింగ్, కూడళ్లు, పార్కులు, శ్మశాన వాటిక, వైకుంఠ రథం, స్వచ్ఛ ఆటోలు, తదితర కీలకమైన అభివృద్ధి పనులు చేపట్టాం. కాలుష్యానికి కళ్లెం వేసి పర్యావరణాన్ని రక్షించాం. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాం. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచి నీటిని అందించాం. ఐదేళ్ల పదవీకాలంలో నాకు సహకరించిన అధికారులకు, కౌన్సిలర్లకు, మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు, పరకాల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు











# క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఘనంగా పోలీస్ క్రీడలు ప్రారంభం






**వరంగల్ వాయిస్, క్రైం :** విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ క్రీడల్లో రాణిస్తున్న పోలీసుల క్రీడా ప్రదర్శన ఇతర క్రీడాకారులకు స్ఫూర్తి దాయకంగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ మూడో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025ను వరంగల్ సీపీ శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న ఈ పోలీస్ క్రీడల్లో తొలి రోజు ప్రారంభోత్సవ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ క్రీడాకారులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ సందర్భంగా వందనం స్వీకరించారు. అనంతరం క్రీడా జెండాను ఎగురవేయడంతో పాటు, అకాశంలోకి పావురాలను, బెలూన్లను ఎగురవేశారు. పోలీస్ క్రీడాకారులు తీసుకొచ్చిన క్రీడా జ్యోతిని పోలీస్ కమిషనర్‌కు అందజేసారు. క్రీడల ప్రారంభోత్సవం సందర్భంగా పురుషుల, మహిళల ఎనిమిది వందల మీటర్ల పరుగు పోటీ, వాలీబాల్ క్రీడలను సీపీ ప్రారంభించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ముందుగా ఈ క్రీడల్లో ఉత్సహంగా పాల్గొన్న క్రీడాకారులతో పాటు, క్రీడల నిర్వహణాధికారులను పోలీస్ కమిషనర్ అభినందించారు. మూడు జోన్లతో పాటు మొత్తం ఆరు జట్లు 12 క్రీడాంశాల్లో పోలీస్ క్రీడాకారులు పోటీ పడుతున్నారని వెల్లడించారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు ముఖ్యం కాదని, ప్రతిభ మాత్రమే ముఖ్యమన్నారు. ఈ క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు, పనిఒత్తిళ్లను అధిగమించి ఆరోగ్యంగా ఉంటారని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో డీసీపీలు రవీందర్, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్, జనగామ ఏఎస్పీ పండరీ చేతన్ నితిన్‌తో పాటు ఏసీపీలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది ఈ క్రీడల్లో ఉత్సహంగా పాల్గొన్నారు.



## అర్జున అవార్డు అందుకున్న
# అథ్లెట్ దీప్తి జీవంజి
### రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన జాతీయ క్రీడా అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా తెలంగాణ క్రీడారత్నం, వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని కల్లెడ గ్రామ ముద్దుబిడ్డ, పారా ఒలింపియన్ అథ్లెట్ దీప్తి జీవంజి అర్జున అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అథ్లెట్ దీప్తి జీవంజికి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ నాటి నుంచి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ప్రకటించారు. అదే విధంగా మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించేలా మెరుగైన స్పోర్ట్స్ పాలసీతో ప్రజా ప్రభుత్వం ముందుకుపోతున్న విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు గుర్తు చేశారు.

# అర్హులకే ప్రభుత్వ పథకాలు

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్
- కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ పథకాలు అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన లబ్ధిదారులకు అందాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో షెడ్యూల్ కులాలకు అందిస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పరిధిలోని మండలాలు, షెడ్యూల్ కులాల జనాభా, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, బ్యాక్ లాగ్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన రుణాలు, శిక్షణ కార్యక్రమాలు, దళిత బంధు, ఎస్సీ స్టడీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలు, సంక్షేమ హాస్టల్స్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం, వైద్య ఆరోగ్య, ఉపాధి హామీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు అందించే వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, తదితర అంశాల గురించి సంబంధిత శాఖల అధికారులు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ కు వివరించారు. సంబంధిత శాఖల అధికారులతో ఆయా పథకాల అమలు తీరుతెన్నుల గురించి సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలు చేస్తున్నారని వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు అభివృద్ధి చెందే విధంగా రుణాలను అందించి ప్రోత్సహించాలన్నారు. సకాలంలో సబ్సిడీ రుణాలు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు సబ్సిడీ రుణాల మంజూరులో జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. సబ్సిడీ రుణాలు సకాలంలో అందకపోవడం వలన షెడ్యూల్ కులాల లబ్ధిదారుల సిబిల్ స్కోర్ తగ్గిపోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం, అధికారులు సబ్సిడీ రుణాలు సకాలంలో అందే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఫసల్ బీమా యోజన పథకాన్ని ఎంతమంది రైతులు జిల్లాలో సద్వినియోగం చేసుకుంటున్నారనే వివరాల జాబితాను తమకు సమర్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి క్షేత్రస్థాయిలో తెలియజేయాలన్నారు. ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనలో కూడా షెడ్యూల్డ్ కులాలకు రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. షెడ్యూల్డ్ కులాలలో ఔత్సహికులను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అధికారులు ప్రోత్సహించాలన్నారు. పేద దళితులు ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు అధికారులు తోడ్పాటు అందించాలన్నారు. న్యాయవిద్యను అభ్యసించే షెడ్యూల్డ్ కులాలకు చెందినవారికి ప్రభుత్వ సహాయం అందుతున్న విషయాన్ని పబ్లిసిటీ ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్ బాబు, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, జాతీయ షెడ్యూల్డ్ కులాల రీసెర్చ్ అధికారి వరప్రసాద్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఏసీపీలు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

### సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి..

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అందించనున్న ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల కోసం నిర్వహిస్తున్న సర్వేలో అర్హులైన లబ్ధిదారుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శుక్రవారం హనుమకొండ వడ్డేపల్లి పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో ప్రభుత్వ పథకాల కోసం నిర్వహిస్తున్న సర్వేను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు సేకరిస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ పథకాల కోసం నిర్వహిస్తున్న సర్వేను గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ రహిత రాష్ట్రం చేద్దాం

- మంత్రి కొండా సురేఖ పిలుపు
- సెక్రటేరియట్ లో పోస్టర్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు డ్రగ్స్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలను జాగృతం చేసేందుకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. వరంగల్ జిల్లాలో నిర్వహించబోయే డ్రగ్స్ వ్యతిరేక ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను మంత్రి సురేఖ శుక్రవారం సెక్రటేరియట్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు పురుషోత్తం నారగోని, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, ములుగు జిల్లా అధ్యక్షుడు రాజు, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి పరామర్శ

**వరంగల్ వాయిస్, తొర్రురు :** మండలంలోని నాంచారి మడూరు గ్రామానికి చెందిన గీతకార్మికుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కేసాగని ఈరయ్య ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఝాన్సీ రెడ్డి వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.సంతోష్, ముఖ్యనాయకులు దీకొండ మధు, బంగారు రమేష్, గ్రామ నాయకులు, మహిళ నాయకులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com